


ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలు

కొంప ముంచిన ఇంటిదొంగలు

- ఖమ్మం కార్పొరేషన్‌లో అక్రమబద్ధీకరణ బాగోతం
- వెలుగులోకి రావడంతో గుట్టుచప్పుడు కాకుండా డీయాక్టివేట్
- వ్యవహారానికి మూలాలు అక్కడినుంచే..
- ప్రస్తుతం కనిపించని ఇంటినెంబర్లన్నీ ఆ కోవలోవే
- గతంలో సెక్షన్ మార్చి చేతులు దులుపుకొన్న అధికారులు

ఖమ్మం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నగరం, మున్సిపాలిటీల పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇంటి పన్నుల చెల్లింపునకు గాను సంబంధిత శాఖ అధికారులు సదరు నిర్మాణాన్ని పరిశీలించి వాటికి అసెస్‌మెంట్ వేసి ఇంటి నెంబరును కేటాయిస్తారు. అయితే ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నిర్మాణం లేని వాటికి, స్థలానికి సంబంధించి అసలు డాక్యుమెంట్లు లేనివాటికి అసెస్‌మెంట్లు వేసిన విషయం గతంలోనే వెలుగులోకి వచ్చింది. కానీ ఆ దొంగ అసెస్‌మెంట్ల దెబ్బ మాత్రం ప్రస్తుత క్రమబద్ధీకరణ వరకు కొనసాగుతోందంటే ఆ అసెస్‌మెంట్ల వ్యవహారం ఏ మేరకు సాగిందో అర్థం చేసుకోవచ్చు.

"అసెస్‌మెంట్, ఇంటి నెంబరు కేటాయింపు అనేది కేవలం వారి ఇంటి పన్ను వసూలు చేయడానికే. వాటిని ఇష్టం వచ్చినప్పుడు రద్దు చేసే అధికారం కార్పొరేషన్ అధికారులకు ఉంది. వాటివల్ల ఎలాంటి అక్రమాలు చేయడానికి తావుండదు" ఇదీ గతంలో దొంగ అసెస్‌మెంట్ల వ్యవహారం బయటకు వచ్చినప్పుడు ఓ ఉన్నతాధికారి చెప్పిన మాట. కానీ ప్రస్తుతం 58, 59 జీవోల ద్వారా క్రమబద్ధీకరణ చేసిన స్థలాలకు ఆ ఇంటి పన్నులే ప్రామాణికంగా మారగా.. దొంగ ఇంటి నెంబర్లతో సంబంధిత జీవోల పేరుతో పెద్దఎత్తున ప్రభుత్వ భూములను అక్రమంగా క్రమబద్ధీకరించుకున్నట్లు తెలుస్తోంది.



ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని రెండు అసెస్‌మెంట్లకు ఒకే ఇంటి నెంబరు, ఒకే రకమైన ఇంటి ఫొటోలు ఉన్నాయి. వాటిలో ఒక అసెస్‌మెంట్ మహిళ పేరిట ఉండగా, మరో అసెస్‌మెంట్ పురుషుడి పేరిట ఉంది. అంతేకాదు సదరు పురుషుడి పేరిట ఆ ఇంటి నెంబరుతో 167 గజాల స్థలాన్ని 59 జీవో పేరుతో క్రమబద్ధీకరించారు.

మూలాలు అక్కడి నుంచే..

ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆ ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలు చేసుకుని నివాసం ఉండేవారికి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం జీవో 58, 59ని తెరపైకి తెచ్చింది. అయితే ఎవరైనా వ్యక్తులు సంబంధిత స్థలాలను తమ పేరుమీద క్రమబద్ధీకరణ చేసుకోవాలంటే ఇంటి పన్నును ప్రామాణికం చేసింది. కాగా ఇటీవల జీవో నెం.59కు సంబంధించి పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్టు వెలుగులోకి రాగా.. అసలు ఆయా రెగ్యులరైజేషన్‌కు అవసరమైన ఇంటి పన్నుల్లో దొంగ ఇంటి పన్నులే మూలాలుగా కనిపిస్తున్నాయి. అక్రమ క్రమబద్ధీకరణ అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే వాటిల్లో రెగ్యులరైజ్ అయిన అత్యధిక డాక్యుమెంట్లలో ఉన్న ఇంటి నెంబర్లు ప్రస్తుతం రికార్డుల్లో కనిపించకుండా పోవడం గమనార్హం. వదుల సంఖ్యలో అక్రమంగా స్థలాలను క్రమబద్ధీకరించుకోగా అందులో సుమారు 50కి పైగా డాక్యుమెంట్ల వరకు వాటిల్లో పొందుపరిచిన ఇంటి నెంబర్లతో అసలు ఇళ్లే లేనట్టుగా స్పష్టమవుతోంది. వాటన్నింటినీ గతంలో సంబంధిత సెక్షన్‌లో ఉన్న అధికారులు అందినకాడికి దండుకుని అడ్డగోలుగా అసెస్‌మెంట్లు వేసినట్టు సమాచారం. ఆ సమయంలో ఒక్కో దొంగ అసెస్‌మెంట్ వేసినదానికిగాను ప్రాంతాన్ని, స్థలాన్ని బట్టి రూ. 40 నుంచి రూ. 2 లక్షల వరకు తీసుకుని జేబులు నింపుకొన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటితోపాటు కొందరు వేరొకరి పేరిట ఉన్న ఇంటి నెంబర్లతో భూములను క్రమబద్ధీకరించుకుని రిజిస్ట్రేషన్లు చేయించుకున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటివరకు కేవలం 59జీవోకు సంబంధించిన అంశాలే వెలుగులోకి రాగా.. 58 జీవోలోనూ ఇదేమాదిరిగా దొంగ ఇంటి నెంబర్లు పొంది వందల సంఖ్యలో పట్టాలు పొందారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 58,59 జీవోల ప్రకారం జరిగిన అక్రమబద్ధీకరణలు రమణగుట్ట, వికలాంగులకాలనీ, వేణుగోపాలనగర్, యూపీహెచ్ కాలనీ, ఇందిరానగర్, శ్రీలక్ష్మీనగర్ లాంటి పలు ప్రాంతాల్లో అత్యధికంగా జరిగినట్లు తెలుస్తోంది.

చడీచప్పుడు లేకుండా డీయాక్టివేట్..

కార్పొరేషన్‌లోని సంబంధిత సెక్షన్ అధికారులతో పాటు మరికొందరు పై అధికారులు ఒక్కటై డబ్బులు దండుకుని అడ్డగోలుగా వందల కొద్దీ అసెస్‌మెంట్లకు అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. వాటిల్లో ప్రభుత్వ భూముల పరిధిలోని ఖాళీ స్థలాలకు కూడా పెద్ద ఎత్తున ఇంటి నెంబర్లు కేటాయించారన్న ఆరోపణలు వినిపించాయి. ఖమ్మం నగరంలో దొంగ అసెస్‌మెంట్లు వేసి ప్రభుత్వ స్థలాలను కాజేసే ప్రయత్నం జరుగుతున్న విషయం వెలుగులోకి రావడంతో కార్పొరేషన్ ఉన్నతాధికారులు 2023 ప్రారంభం నాటి నుంచి వేసిన అసెస్‌మెంట్లను మరోసారి బిల్ కలెక్టర్ల ద్వారా విచారణ చేయించారు. అంతవరకు బాగానే ఉండగా.. ఆ సమయంలో కేవలం 36 అసెస్‌మెంట్లు మాత్రమే దొంగ అసెస్‌మెంట్లు ఉన్నాయంటూ వాటిని డీయాక్టివేట్ చేశామని చెప్పారు కార్యాలయ ఉన్నతాధికారులు. కానీ పైకి మాత్రం అలా చెప్పి అంతర్గతంగా వందల కొద్దీ అసెస్‌మెంట్లు డీయాక్టివేట్ చేసినట్టు తెలుస్తోంది. కొన్ని అసెస్‌మెంట్లు అయితే ఉన్నతాధికారికి తెలియకుండానే కిందిస్థాయి అధికారులు డీయాక్టివేట్ చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఫలితంగానే ప్రస్తుతం క్రమబద్ధీకరణ చేసిన ఇంటి నెంబర్లు కనిపించడం లేదన్న వాదన వినిపిస్తోంది. ముందుగా అసెస్‌మెంట్లు వేసి ఇంటి నెంబర్లు కేటాయించి అక్రమార్కులకు రశీదులు ఇవ్వడంతో వారు ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ తర్వాత దొంగ ఇంటినెంబర్లు కేటాయించిన అంశాలు వెలుగులోకి రావడంతో వాటిని డీయాక్టివేట్ చేసినట్టు సమాచారం.

నాడు దొంగ అసెస్‌మెంట్లు.. నేడు జీవో 59 అక్రమాలను వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'

ప్రభుత్వ స్థలాలకు దొంగ అసెస్‌మెంట్లు వేసి కాజేసే ప్రయత్నం చేసే అంశాన్ని నాడు 'ఇంటి దొంగలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. కొన్ని ఇంటి నెంబర్ల ఉదాహరణలు సహా వివరాలను పొందుపరిచింది. ఆ తర్వాత అదే విషయానికి సంబంధించి మరికొన్ని వార్తా కథనాలను కూడా ప్రచురించింది. దాంతో కదిలిన కార్పొరేషన్ అధికారులు గతేడాది వరకు మాత్రమే అసెస్‌మెంట్లను పరిశీలించి ఎనిమిది మందిపై కేసు కూడా నమోదు చేశారు. కానీ నేటివరకు సదరు కేసు విచారణ ఎంతవరకు వచ్చిందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత దొంగ అసెస్‌మెంట్లు నిజమని తేలడంతో సంబంధిత సెక్షన్ అధికారులను మరో సెక్షన్‌కు మార్చి చేతులు దులుపుకొన్నారు. ప్రస్తుతం అదే అధికారులు తిరిగి పాత సెక్షన్‌లోకి వచ్చే ప్రయత్నాలు చేయడం గమనార్హం. ఆ సమయంలో వారి కార్యాలయానికి సంబంధించిన అధికారులను తప్పించే క్రమంలోనే అందంతా చేశారన్న ప్రచారమూ జరగ్గా.. ప్రస్తుతం క్రమబద్ధీకరణలో అక్రమాలు జరిగిన అంశాల మూలాలు సైతం అక్కడే ఉండటం గమనార్హం. 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాల్లో సదరు సెక్షన్‌లో పనిచేసిన పలువురు అధికారులు గతంలో కూడా అదేరీతిలో దొంగ అసెస్‌మెంట్లు వేసినా చర్యలు తీసుకోలేదన్న విషయాన్ని కూడా ప్రస్తావించింది. కాగా నాడు దొంగ అసెస్‌మెంట్ల విషయాన్ని వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి' ప్రస్తుతం 59 జీవోలో కూడా అక్రమాలు జరిగిన విషయాన్ని ఆధారాలు సహా బయటపెట్టింది. నాడు కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంటి దొంగలు కాసుల కోసం చేసిన అక్రమాలు ప్రస్తుతం అటు జిల్లా, ఇటు కార్పొరేషన్ కార్యాలయ ఉన్నతాధికారులకు కలకంగా మారుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 58, 59జీవోలకు సంబంధించి చేసిన క్రమబద్ధీకరణ చేసిన డాక్యుమెంట్లలో ఉన్న ఇంటి నెంబర్లకు వేసిన అసెస్‌మెంట్ల లాగిన్ వివరాలను పరిశీలిస్తే అసలు బాగోతం అంతా బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటితోపాటు ఒకరిపేరుమీద ఉన్న ఇంటి నెంబర్లతో వేరొకరి పేరుమీద భూములు క్రమబద్ధీకరణ చేసిన అధికారులపై, వాటి మూలాలకు సంబంధించి నాడు అసెస్‌మెంట్లు వేసిన అధికారులపై చర్యలకు ఉపక్రమించాలని ప్రజలు కోరుతున్నారు.

జూదాల జోరు.. పందాల హోరు

- న్యూఇయర్ వేళ సత్తుపల్లి ప్రాంతంలో పలు పందాలు

సత్తుపల్లి, జనవరి 1 : సంక్రాంతికి ముందే నూతన సంవత్సర వేళ ఏపీకి సరిహద్దున ఉన్న సత్తుపల్లి ప్రాంతంలో పేకాట, గుండాట, కోడిపందాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. తెలుగురాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న సత్యనారాయణపురం, సదాశివునిపేటలోని పలు తోటల్లో నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం రాత్రి, సోమవారం కోడిపందాలు, పేకాట జోరుగా సాగింది. మూడు, నాలుగు రోజుల నుంచే పందాలరాయుళ్లు కోడిపందాలు, జూదాలతో ఊగిపోయారు. కోసాట, గుండాట, మూడు ముక్కలాట, గ్లాస్ బాల్ లాంటి రకరకాల పేర్లతో సాగిన జూదంలోనూ రూ.లక్షల్లో చేతులు మారినట్టు చర్చ జరుగుతోంది. రాజకీయ పెద్దలు, బడాబాబులు సాగించిన జూదక్రీడల్లో పందెగాళ్లు డబ్బులు పెట్టగా దానిలో ఎక్కువ మొత్తంలో నిర్వాహకుల జేబుల్లోకి వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. ఏపీ, తెలంగాణ సరిహద్దులోని సత్తుపల్లి మండలంలో సంప్రదాయం పేరుతో కోడిపందాలకు లోపాయికారి అనుమతి తీసుకున్న నిర్వాహకులు జూద శిబిరాలను ఏర్పాటుచేసినట్టు తెలుస్తోంది. మూడు ముక్కలాట, గుండాటలో అయితే డబ్బు పోగొట్టుకున్న వారే కానీ వచ్చిన వారే లేరన్న చర్చ జరుగుతోంది. కోడిపందాల్లో కంటే వీటిలో పోగొట్టుకున్న సొమ్మే ఎక్కువంటూ బాధితులే వాపోతున్నారు. ఈ పందాల హోరుషానికి మద్యం మత్తు తోడవడంతో పలుచోట్లా ఘర్షణలు జరిగినా బయటకు పొక్కలేదని, సదాశివునిపేటలో పోలీసులు వస్తున్నారని సమాచారం రావడంతో ఓ వ్యక్తికి చెందిన మొక్కజొన్న తోట పూర్తిగా ధ్వంసమైందని, ఆ గ్రామానికి చెందిన పెద్దలు చెబుతున్నారు. సంక్రాంతికి ముందుగానే ఇలా అక్కడా ఇక్కడా ఇష్టారాజ్యంగా కొందరు జూదాలు నడిపిస్తుంటే.. ఇంకా ఆ నాలుగు రోజులు పరిస్థితి ఏంటంటూ డబ్బులు పోగొట్టుకున్న వారు, వారి కుటుంబసభ్యులు వాపోతున్నట్లు సమాచారం. ఇదే విషయమై సత్తుపల్లి పట్టణ సీఐ జె.మోహన్‌బాబును వివరణ కోరగా సతుపల్లి మండలంలో పేకాట, కోడిపందాల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని, రేజర్ల, సదాశివునిపేట, సిద్దారం తదితర గ్రామాల్లో దాడులు చేశామని, ఇప్పటి వరకు ఎవరూ పట్టుబడలేదని, అలాంటి కార్యక్రమాలను నిర్వహించడం చట్టరీత్యానేరమని హెచ్చరించారు. ఇక సత్తుపల్లి ప్రాంతంలో జూదాలు, పందాలు.. బహిరంగంగానే జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారి దృష్టికి వెళ్లినా చర్యలకు తీసుకోవడంలేదని తెలుస్తోంది.

పెనుబల్లి మండలంలోనూ...

పెనుబల్లి : పెనుబల్లి మండలంలోనూ జూదాలు, పలుపందాలు యథేచ్ఛగా జరిగినట్లు చర్చజరుగుతోంది. అధికారుల అండదండలతో కొందరు పేకాట స్థావరాలు నిర్వహించారని, కొద్దిరోజులుగా ఇదే జరుగుతోందని తెలుస్తోంది. కొందరు నిర్వాహకులు అధికారులతో సాన్నిహిత్యాన్ని పెంచుకొని నెలవారీ మామూళ్లు ముట్టజెప్పి స్థావరాలను ఏర్పాటుచేసి జూదం ఆడిస్తున్నారన్న విమర్శలున్నాయి. మండలంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులే కాకుండా మరికొందరు కూడా ఈ జూదం నిర్వహణలో మునిగితేలుతున్నారని ప్రచారం జరుగుతోంది. టేకులపల్లి, మండాలపాడు, లింగగూడెం, పాత, కొత్త కారాయిగూడెం, గణేశుపాడు గ్రామాల సరిహద్దు మామిడితోటలు, ఇతర ప్రాంతాలను స్థావరాలుగా చేసుకున్నారని, ఇతర ప్రాంతాలకు చెందిన జూదరులు ఈ స్థావరాలకు వస్తున్నారని, ఫలితంగా రూ.లక్షలు చేతులు మారుతున్నాయని సమాచారం. దీనిపై అధికారులు వట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని గురించి పోలీసు అధికారులను సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

కోడి పందాల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ములకలపల్లి : మండలంలోని రాచనగూడెం గ్రామశివారులో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 17 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 17కోడి పుంజులు, రూ.42,160వేల నగదుతో పాటు 37 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అయితే దాడి సమయంలో చాలా మంది తమ వాహనాలను వదిలేసి పరారైనట్లు సమాచారం. అదే విధంగా పిండిప్రోలు గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రాజమౌళి దాడి చేసి ఇద్దరిని అదులోకి తీసుకొని వారి నుంచి రెండు కోడి పుంజులతో పాటు రూ.1000 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



ఆదివారం రాత్రి సత్యనారాయణపురం కోడి పందాల వద్ద జనం



టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, కేక్ కట్‌చేస్తున్న మంత్రి, పక్కన టీడీపీ నాయకులు

నాటి ఎన్టీఆర్ పాలన.. నేటి పాలకులకు మార్గదర్శకం

- టీడీపీ కార్యకర్తల సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 1 : నాడు ఎన్టీఆర్ పాలన.. నేటి పాలకులకు మార్గదర్శకమని, ఆయన సారథ్యంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు, ప్రభుత్వాలకు దిక్సూచిగా నిలిచాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఖమ్మంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మంత్రి తుమ్మల హాజరయ్యారు. తొలుత టీడీపీ కార్యాలయానికి వచ్చిన తుమ్మలకు టీడీపీ నాయకులు కేతినేని హరీష్, కూరపాటి వెంకటేశ్వర్లు తదితరులు ఘన స్వాగతం పలకగా.. అక్కడి ఎన్టీఆర్ విగ్రహానికి తుమ్మల పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం అన్న నినాదంతో ఎన్టీఆర్ 1982 మార్చి 22న స్థాపించిన టీడీపీ.. దేశ, రాష్ట్ర రాజకీయాల్లోనే విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిందని, దేశ రాజకీయాల్లోనూ ఓ గౌరవాన్ని సంపాదించుకుందన్నారు. ఆయన తెచ్చిన సంక్షేమ రాజ్యం దేశంలోని అన్ని పార్టీలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్నారయన్నారు. ఎన్టీఆర్ ఎంతో దూరదృష్టితో చేసిన కార్యక్రమాలు నేటికీ అనుసరణీయంగా ఉన్నాయంటే ఎన్టీఆర్ పేదల గుండెల్లో నిలిచిపోయినట్టేనన్నారు. తాను ఏ ప్రభుత్వంలో ఉన్నా ఆయన సంక్షేమ సూత్రాలకు అనుగుణంగా పనిచేస్తానని తుమ్మల హామీ ఇచ్చారు. నాడు టీడీపీ కార్యాలయాన్ని ఖమ్మంలో నిర్మించామని, లీజుకు తీసుకున్న ఈ భవనాన్ని రెగ్యులరైజ్ చేసేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పనిచేశారని, తన, కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తా తనకు మొదటి కార్యకర్తలేనన్నారు. తన విజయంలో సహకరించిన అందరికీ రుణపడి ఉంటానన్నారు. టీడీపీ కార్యకర్తలెప్పుడూ తన తమ్ముళ్లేనని, ప్రజల కోసం వారి సూచనలు తీసుకుంటానన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజకీయ పరిణామాల నేపథ్యంలో తాము పార్టీలు మారినప్పటికీ అభివృద్ధే పరమావధిగా పనిచేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో ఏపీలోనూ తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషిచేద్దామని కోరారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలను టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీవీ రాఘవులు, గుత్తా సీతయ్య, వడ్డెం విజయ్, నల్లమల రంజిత్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, నల్లమల వేణు, మిక్కిలినేని మంజుల, తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం రామాలయంలో భక్తుల రద్దీ

ఘనంగా నూతన వేడుకలు

- కొత్తఏడాది ఆరంభం రోజున దేవాలయాల్లో భక్తుల రద్దీ

ఖమ్మం సాంస్కృతికం / కొత్తగూడెం సాంస్కృతికం/ భద్రాచలం, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి ఇళ్ల ముందు రంగవల్లికలతో అలంకరించి.. బాణసంచా కాల్చి, పలుచోట్ల డీజే డ్యాన్సులతో హోరెత్తించారు. ఇక సోమవారం ఉదయం నుంచే దేవాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఖమ్మంలోని నరసింహస్వామి దేవాలయం, పర్ణశాల రామాలయం, గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయంతో పాటు పలు ఆలయాలు రద్దీగా కనిపించాయి. మరోవైపు భద్రాచలం రామయ్య సోమవారం ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చారు. నూతన సంవత్సరం తొలిరోజు వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నూతన ఆంగ్ల సంవత్సర వేళ భక్తుల కోలాహలంతో రామాలయం పరిసరాలు సందడిగా కనిపించాయి. ఇదిలా ఉండగా బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఇరుజిల్లాల్లో ప్రజలు బంధు, మిత్రులతో కలసి విందులు వినోదాల్లో గడిపారు. రెస్టారెంట్లు వినియోగదారులతో సందడిగా కనిపించాయి. అలాగే ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్కు, లకారం ట్యాంకుబండ్ తదితర ఆహ్లాదకర ప్రదేశాల్లోనూ జనం సందడి చేశారు. మద్యం దుకాణాలు కూడా రద్దీగా కనిపించాయి.



ఖమ్మం స్తంభాద్రి ఆలయం వద్ద భక్తుల బారులు

ఆదాయం మిన్న.. సౌకర్యాలు సున్నా

- తాత్కాలిక వసతులతోనే జూలూరుపాడు ఉపమార్కెట్ నిర్వహణ
- నిలువ నీడ లేక రైతులు, హమాలీల సతమతం
- కలగానే శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణం
- స్థలం కేటాయించినా పనులకు లభించని మోక్షం

జూలూరుపాడు, జనవరి 1: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సరైన మార్కెట్ వసతులు లేకపోవడంతో పంటను అమ్ముకోవడానికి ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల మార్కెట్లు ఉన్నా అరకొర వసతులతో అవి పూర్తిస్థాయిలో రైతులకు ఉపయోగపడటం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ప్రసిద్ధి చెందిన జూలూరుపాడులో పూర్తిస్థాయి వ్యవసాయ మార్కెట్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూలూరుపాడు మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి సరైన వేదిక లేకపోవడంతో వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నో ఏళ్లుగా తాత్కాలిక వసతులతోనే..

ఖమ్మం జిల్లా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ వారి ఆధ్వర్యంలో జూలూరుపాడులో తాత్కాలిక ఉపమార్కెట్ యార్డును ఏర్పాటు చేసి పత్తి క్రయ, విక్రయాలను నిర్వహిస్తున్నారు. ఈ యార్డులో రోజుకు సుమారు రూ.2కోట్ల నుంచి రూ.3కోట్ల వరకు పత్తి విక్రయాలు జరుగుతున్నాయి. తద్వారా ఏటా మార్కెట్‌శాఖకు రూ.2కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. అయినా మార్కెట్‌లో వసతులు కల్పించకపోవడంతో రైతులు, వ్యాపారులు, హమాలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తిని నిల్వ చేసేందుకు కనీసం షెడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. హమాలీలు, రైతులు సేద తీరేందుకు ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో వారు ఎండలోనే మగ్గిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలుసార్లు హమాలీలు, రైతులు, వ్యాపారులు నియోజకవర్గ, స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి జూలూరుపాడులో శాశ్వత మార్కెట్‌యార్డును ఏర్పాటు చేయాలని కోరారు. అయినా ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం గమనార్హం.



జూలూరుపాడులో ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తున్న ఉపమార్కెట్ యార్డు

మార్కెట్‌యార్డు నిర్మాణంలో తీవ్ర జాప్యం..


ఏన్కూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఆధ్వర్యంలో 2011లో జూలూరుపాడులోని పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఓ ప్రైవేట్ స్థలంలో తాత్కాలిక ఉపమార్కెట్ యార్డును ప్రారంభించి పత్తి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. గత నాలుగు సంవత్సరాలుగా జూలూరుపాడు నుంచి ఒంటిగుడిసె వెళ్లే రహదారి పక్కన ఓ రైతుకు చెందిన స్థలంలో మార్కెట్‌యార్డును ఏర్పాటు చేసి ఏన్కూరు మార్కెట్‌కమిటీ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. కాగా 2016లో శాశ్వత మార్కెట్‌యార్డు నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని అప్పటి ఏన్కూరు మార్కెట్ శాఖ కార్యదర్శి నిర్మల రెవెన్యూశాఖ అధికారులను కోరారు. మూడేళ్ల క్రితం జూలూరుపాడు రెవెన్యూ పరిధిలో శాశ్వత మార్కెట్‌యార్డుకు 10ఎకరాల భూమిని గుర్తించారు. దీంతో రైతులు, హమాలీలు, వ్యాపారులు తమ ఇబ్బందులు తొలిగిపోతాయని భావించారు. కానీ స్థలాన్ని కేటాయించినా ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోకపోవడం పట్ల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణాన్ని ఎప్పుడు చేపడతారో కూడా తెలియని పరిస్థితి నెలకొందని వారు అంటున్నారు. ఇంకా ఎన్నాళ్లు ఈ ఇబ్బందులను ఎదుర్కోవాలని రైతులు, హమాలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా జూలూరుపాడులో శాశ్వత మార్కెట్‌యార్డును ఏర్పాటు చేసేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

అటు సంకల్ప యాత్ర ఇటు ప్రజా పాలన

» ఏకకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రచారం
» గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల వేడి » ఊపిరి సలపని ఒత్తిడిలో అధికారులు

"తొమ్మిదిన్నరేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల ప్రచారం ఓవైపు.. తెలంగాణలో నూతన రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలన మరోవైపు గ్రామాల్లో ఏకకాలంలో నిర్వహిస్తున్నాయి. దాంతో ఏప్రిల్, మే నెలల్లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల వేడి ముందుగానే గ్రామాల్లో కన్పిస్తోంది. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రచారం అధికారికంగా డిసెంబరు 24న దేశవ్యాప్తంగా మొదలైంది. జనవరి 25 వరకు ఈ పథకాల ప్రచార యాత్ర కొనసాగ నుంది. ఈ నేపథ్యంలోనే డిసెంబరు 7న తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు వందరోజుల్లో ఆరు గ్యారెంటీ స్కీంల అమలులో భాగంగా డిసెంబరు 28నుంచి ప్రజాపాలన చేపట్టింది. ఈనెల ఆరోతేదీ వరకు ఈ ప్రజాపాలన సాగనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఈ రెండు కార్యక్రమాలను కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అన్నిశాఖల అధికారులు పాల్గొని నిర్వహించాల్సి వస్తోంది. దీంతో ఈ రెండు ప్రభుత్వాల మధ్య అధికారులు, సిబ్బంది నలిగిపోతున్నారు. -వైరా"





ఎంపీడీవోల ఆధ్వర్యంలో నిర్వహణ

వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీవోల నేతృత్వంలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయం, పంచాయతీరాజ్, స్త్రీశిశుసంక్షేమం, వైద్యఆరోగ్యం, విద్యా, విద్యుత్, ఉపాధి హామీ, బ్యాంకులు, ఇంధనం తదితర శాఖలన్నీ వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొ ని కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామసభల్లో ప్రజలకు వివరించాల్సి ఉంది. ఉజ్వల పథకం కింద ఉన్న గ్యాస్ కనెక్షన్లు, ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధియోజన, బ్యాంకుల్లో అమలుచేస్తున్న జీవిత బీమా అలాగే స్త్రీశిశుసంక్షేమశాఖలో అమలుచేస్తున్న పోషణ్ అభియాన్, విద్యుత్‌లో అమలుచేస్తున్న ఉదయ్ సహా మట్టినమూనాలు, తెలంగాణ అభివృద్ధికి కేంద్రప్ర భుత్వం అందిస్తున్న స హకారం వంటి కార్యక్రమాలను వివరిం చాల్సి ఉంది. ఒక వాహనం ద్వారా భారీ ఎల్‌ఈడీ స్క్రీ న్‌ను ఏర్పాటు చే సి మోడీ ప్ర సంగం, కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామసభల్లో ప్రచారం చేశా రు. 24 నుంచి 27 వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభల్లో అన్నిశాఖల అధికారులు పాల్గొంటున్నారు.

డిసెంబరు 28 నుంచి ఆరుగ్యారెంటీలు

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీంల అమలులో భాగంగా డిసెంబరు 28వతేదీ నుంచి ప్రజాపాలన ప్రారంభించింది. చేయూత, రైతుభరోసా, మహాలక్ష్మీ, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు కోసం ప్రజాపాలన ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతిరోజూ రెండు గ్రామాల చొప్పున ప్రజాపాలన నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండేసి గ్రామాల్లో ఎంపీడీవో, తహసీల్దార్ ఇతర అధికారులు టీంలీడర్లుగా ఏర్పడిన అధికార యంత్రాంగం దరఖాస్తులు స్వీకరిస్తున్నది. ప్రతి జిల్లాకు ఇన్‌చార్జ్ మంత్రిని, నోడల్ అధికారిని అలాగే నియోజకవర్గ, మండలస్థాయిలో ప్రత్యేక నోడల్ అధికారులను కూడా ప్రజాపాలన పర్యవేక్షణకు ప్రభుత్వం నియమించింది. అయితే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అన్నిశాఖల అధికారులు ప్రజాపాలనలో నిమగ్నం కావడంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కేవలం ఎల్‌ఈడీ స్క్రీంలతో ప్రచారానికి పరిమితమైంది. ఓవైపున బీజేపీ మరోవైపున కాంగ్రెస్ ప్రజలను తమవైపు ఆకర్షించుకొని లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాలు రాబట్టేందుకు ముందుకు సాగుతున్నాయనే ప్రచారం సాగుతోంది. ఈ రెండు ప్రభుత్వాల కార్యక్రమాల్లో అధికార యంత్రాంగానికి ఊపిరి సలపడం లేదు.

రహదారులు రక్తసిక్తం!

» ఇరు జిల్లాల్లో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు.. ముగ్గురి దుర్మరణం, మరొకరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నర్సింహారావు

దమ్మపేట/ తిరుమలాయపాలెం జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా ఇరు జిల్లాల ప్రజలు సంతోషంగా వేడుకలు జరుపుకుంటే.. ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. సోమవారం భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. ఒకరు గాయపడ్డారు. ఈసంఘటనలతో ఆ కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి.



లక్ష్మణ్(ఫైల్‌ఫొటో)

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని..

రెండు ద్విచక్రవాహనాలు ఎదురుగా వస్తూ ఢీకొట్టుకొన్నాయి. ఈసంఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దమ్మపేట మండలం పెద్దగొల్లగూడెం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. ఈఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అప్పారావుపేటకు చెందిన రేగళ్ల నర్సింహారావు (40), మరో వ్యక్తి వెంకటేశ్వరరావుతో కలిసి పెద్దగొల్లగూడెం గ్రామం వైపు నుంచి అప్పారావుపేట వస్తున్నారు. ఇదే క్రమంలో దిబ్బగూడేనికి చెందిన బుద్ధ పుల్లారావు (38), ద్విచక్రవాహనంపై దమ్మపేట నుంచి దిబ్బగూడెం వెళుతుండగా గొల్లగూడెం సమీపంలో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొట్టాయి. ఈఘటనలో నర్సింహారావు, పుల్లారావు, వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. రేగళ్ల నర్సింహారావు అక్కడికక్కడే మృతి చెందగా, బుద్ధ పుల్లారావు దమ్మపేట వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరొక వ్యక్తి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడగా స్థానికంగా ప్రథమ చికిత్స ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం

తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన ఓ యు వకుడు రోడ్డు ప్రమాదంలో సోమ వారం మృతి చెందాడు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన మల్లెల లక్ష్మణ్ (26) ఖమ్మంలోని ఓప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ద్విచక్ర వాహనంపై మహ బూబాబాద్‌జిల్లా డోర్నకల్ మండలం ములకలపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరు మలాయ పాలెం వస్తుండగా గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈఘటనలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతిచెం దాడు. మృతుడు లక్ష్మణ్‌కి భార్య, 8 నెలల కుమారు డున్నారు. మృతుడి బంధువులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయ గా.. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆటోపై రాళ్లతో దాడి

ఖమ్మంక్రైం, జనవరి1: నూతన సంవత్సర వేడుకలు అందరు ప్రశాంతంగా జరుపుకుంటున్న సమయంలో కొంతమంది అకతాయిలు ఆ టోపై రాళ్లువేసి ధ్వంసంచేశారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో నగ రంలోని చర్చికాంపౌండ్ ప్రాంతంలో ఉన్న ఓ ఆసుపత్రి పార్కింగ్ ప్ర దేశంలో ఓ ఆటోను పార్కింగ్ చేశారు. ఫుల్లుగా మద్యం సేవించిన ము గ్గురు అకతాయిలు ఆసమయంలో బండరాళ్లతో ఆటోపై వేసి ధ్వంసం చేశారు. అదేవిధంగా పార్కింగ్‌లో ఉన్న ఇతర వాహనాలను కూడా పగల గొట్టేందుకు ప్రయత్నం చేశారు. సోమవారం ఉదయం చూసిన ఆసుపత్రి సిబ్బంది వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటన చేరుకుని సీసీ కెమేరాలు పరిశీలించి నిందితులను గుర్తించారు. అనంతరం వారిపై కేసు నమోదుచేశారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

కరకగూడెం, జనవరి 1: మండలంలోని మోతె గ్రామానికి చెందిన మెంచిని శంకర్ అనే వ్యక్తికి చెందిన పూరిల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఈసంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఒక ద్విచక్ర వాహనం, ఇంటి సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలి బూడిద య్యాయి. ఇల్లు దగ్ధం అవడంతో సుమారు రూ. రెండు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్ కరకగూడెం పంచాయితీ కార్యాలయంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అక్కడకు చేరుకుని శంకర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుక వెళ్లి ప్రభుత్వం నుంచి సహాయ సాకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు షేక్ రఫీ, కోరగట్ల విశ్వనాథం, వాసిరెడ్డి రాజేందర్, ధనంజయ్, పోలెబోయిన సుజాత, గోగు కిరణ్, బాలకృష్ణ, కార్తీక్ పాల్గొన్నారు.

ఇంజన్‌లో మంటలు.. దగ్ధమైన వరికోత యంత్రం

సుజాతనగర్, జనవరి1: అకస్మాత్తుగా మంటలు వ్యాపించి వరికోత యంత్రం దగ్ధమైంది. ఈ సంఘటన సోమవారం సుజాతనగర్‌లో జరిగింది. సుజాతనర్ గ్రామానికి ఓ కౌలు రైతు వరి కోత కోస్తుండగా ఒక్కసారిగా ఇంజన్‌లో నుంచి మంటలు వచ్చాయి. ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణ ంగా మంటలు యంత్రం మొత్తం వ్యాపించి క్షణాల్లో కాలి బూడిదయింది. దీని విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని యంత్రం యజమాని కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన కోటి. రాజేష్ తెలిపారు. షార్ట్ సర్క్యూట్ సమయంలో మంటల ఆర్పడానికి ప్రయత్నం చేయడంతో అతని చేతి వేళ్లు కొంత మేర కాలాయి. కిరాయి కోసం అంత దూరం నుంచి ఇక్కడికి వచ్చి యంత్రాన్ని కోల్పోయానని కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న గౌరి

అశ్వారావుపేట రూరల్, జనవరి 1: భర్త వేధింపులు భరించలేక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం అర్ధరాత్రి భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేట మండలంలోని పేరాయిగూడెం పంచాయతీలోని మోడల్‌కాలనీకి చెందిన పొదిల గౌరి(22)కి ఏడాది క్రితం ఏపీలోని నందిగామకు చెందిన గోపినాథ్‌తో వివాహం జరిగింది. వీరికి మూడు నెలల బాబు ఉన్నాడు. అయితే భర్త గోపినాథ్ అనుమానంతో తరచుగా భర్య గౌరిని వేధిస్తుండటంతో కొద్దిరోజుల క్రితం ఆమె పేరాయిగూడెంలోని తన పుట్టింటికి వచ్చి ఉంటోంది. అయినా గోపినాథ్ తరుచూ ఆమెకు ఫోన్‌చేసి వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కుటుంబసభ్యులు చర్చికి ప్రార్ధనకు వెళ్లగా గౌరి తన నాయనమ్మతో కలిసి ఇంట్లోనే ఉంది. ఆదివారం రాత్రి 12గంటలు దాటిన తరువాత తన కుమారుడి కోసం కట్టిన ఉయ్యాల తాడుతో ఉరేసుకుంది. తరువాత కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించినా ఫలితం లేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గౌరి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి భర్త గోపినాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి బాలుడి మృతి



నాగేంద్రబాబు (ఫైల్)

దుమ్ముగూడెం జనవరి 1: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలంలో ఓ బాలుడు ప్రమాదవశాత్తు స్థానిక చెరువులో పడి మృతిచెందిన సంఘ టన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రగళ్లపల్లి పంచాయతీ రాయగట్టులో తుర్రం ధర్మయ్య, సుమిత్రల కుమారుడు నాగేంద్రబాబు(5) డిసెంబరు 31న సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆడుకుంటూ స్థానిక చెరువులో పడి మునిగిపోయాడు. చుట్టుపక్కలవా ళ్లు గమనించి చెరువు వద్దకు చేరుకుని బాలుడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మారుమూల ప్రాంతంలో జరిగిన ఈ ఘటన సోమవారం ఉద య్ మీడియాకు తెలిసింది. అయితే ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదుకాలేదు.

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

ఖమ్మంక్రైం, జనవరి 1: రైలుకింద పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. నల్లగొండ జిల్లా ముకుందాపురం మండలం మునగాల గ్రామానికి చెందిన విలాసకవి నర్సింహారాజు (50) అనే వ్యక్తి నగరంలోని శ్రీ నివాసనగర్ సమీపంలోని రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కిందపడి మృతి చెందాడు. ఈవిషయాన్ని రైల్వే సిబ్బంది జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనస్థలం వద్దకు చేరుకుని మృతుని వద్ద ఉన్న ఆధార్‌కార్డు ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని జనవరి 1: మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన కంచుమర్తి శ్రీనివాసరావు (55) ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 25వ తేదీన శ్రీనివాసరావు తన పొలంలో వరికోత మిషన్‌తో పంట నూర్పిడి చేయిస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ కింద పడి గాయపడ్డాడు. అప్పటి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మరణించాడు. మృతునికి కుమారుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని యువతి బలవన్మరణం

సత్తుపల్లి రూరల్, జనవరి 1: మండల పరిధిలోని రేజర్లకు చెందిన బోళ్ల జ్యోతిక ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన బోళ్ళ మన్మథరావు, సరోజినీ దంపతుల చిన్న కుమార్తె జ్యోతిక (22) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుంది. అనారోగ్య బాధలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి సోదరుడు ఉన్నాడు

గుట్టుగా గంజాయి రవాణా

» బీరువాలో అక్రమంగా తరలిస్తుండగా 120 కిలోల స్వాధీనం
» వివరాలు వెల్లడించిన భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



సీజ్ చేసిన గంజాయి వివరాలు వెల్లడిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బీరువాలో తరలిస్తున్న 120కేజీల గంజాయిని సోమవారం భద్రాద్రి జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ వినిత్ వెల్లడించారు. గతనెల 28వ తేదీన ఉదయం 10గంటల సమయంలో కేఏ38ఎ3677 అనే నెంబరు గల వాహనం(ట్రక్)లో నిషేధిత గంజాయిని తరలిస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం అందడంతో టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి తన సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన తనిఖీలు చేస్తున్న తెలుసుకున్న నిందితుడు నిషేధిత గంజాయి ఉన్న ఆ వాహనాన్ని పెట్రోల్‌బంకు వెనుక వదిలేసి పారిపోయాడు. అప్పటి నుంచి ఆ వాహనం అక్కడే ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రమణారెడ్డి సోమవారం ఆ వాహనాన్ని స్థానికుల సమక్షంలో తనిఖీ చేయగా అందులో మూడు ఇనుప బీరువాలు ఉన్నట్లు గుర్తించారు. గ్యాస్ కట్టర్ సహాయంతో వాటిని తెరిచి చూడగా రెండు బీరువాల్లో గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. ఈ గంజాయిని దాచిపెట్టిన రెండు బీరువాల్లో ముందు భాగాన్ని ఖాళీగా ఉంచి బీరువా వెనుక గంజాయిని అమర్చడానికి వీలుగా అల్మారాలు తయారు చేశారు. సుమారుగా 120కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోగా దాని విలువ సుమారు రూ.30లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ వాహనం బీదర్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ షకీల్‌పాషా అనే వ్యక్తి పేరు మీద రిజిస్ట్రర్ అయి ఉందన్నారు. ఆ వాహన యజమాని మహ్మద్ షకీల్ పాషాను విచారించగా తాను కొద్ది రోజుల క్రితం తనకు తెలిసిన డ్రైవర్ అయిన మజార్ అనే వ్యక్తికి తన వాహనాన్ని కిరాయికి ఇచ్చినట్లు తెలిపాడని ఎస్పీ వివరించారు. పరారీలో ఉన్న నిందితుడు మజార్ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామని ఎస్పీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని, నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలల్లో చదివే పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నా ర న్నారు. జిల్లాలో యువత మత్తు పదార్థాలను వినియో గించే ప్రదేశాలను గుర్తించామని, ఎవరైనా మత్తు పదార్థాలను తీసుకుంటున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, టేకులపల్లి ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐలు రమణారెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

5న సర్దార్ స్టేడియంలో కబడ్డీ జిల్లా జట్ల ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 1: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ క్రిష్టఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి ఈనెల 11 నుంచి 14 వరకు గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని ఆయన తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2004 ఫిబ్రవరి 5 తరు వాత జన్మించి (20 సంవత్సరాల లోపు) ఉండాలని తెలి పారు. బాలురు 70 కిలోలు, బాలికలు 65 కిలోల లోపు ఉండాలన్నారు. జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులు జనవరి ఐదున సర్దార్ పటేల్ స్టేడియానికి చేరుకోవాలని క్రిస్టోఫర్ ఈసందర్భంగా కోరారు.

బిల్లులు రాక.. పనులకు బ్రేక్

» కల్లూరులో ముందుకు సాగని అభివృద్ధి పనులు
» నిధుల కొరతతో నిలిచిన వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణాలు



నిధుల కొరతతో కల్లూరులో నిలిచిన షాదీఖానా నిర్మాణ పనులు



బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిన జలవనరులశాఖ సర్కిల్ కార్యాలయ భవనం

కల్లూరు, జనవరి1: ఏళ్లకు ఏళ్లు ఎదురు చూస్తే అప్పటి ప్రభుత్వం వాటికి అనుమతి ఇచ్చింది. పాలన పరమైన అనుమతులకు మరికొంత సమయం పట్టింది. ఈ లోగా స్థలాల కేటాయింపు పెద్ద ప్రహసనమైంది. ఇవన్నీ దాటుకుని నిర్మాణ పనులు ప్రారంభమయ్యే సరికి పుణ్య కాలం కాస్త పూర్తయింది. ఆ పనులు ప్రారంభం కాగానే ఎన్నికల కోడ్ వచ్చింది. ప్రభుత్వం మారింది.


కల్లూరు పట్టణంలో పలు రకాలుగా చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు అందక కాంట్రాక్టర్లు వాటి పనులు అర్ధాంతరంగా నిలిపి వేశారు. అందులో జలవనరులశాఖ సర్కిల్ కార్యాలయ భవనం కాగా, మరొకటి ముస్లింల షాదీఖానా భవనం. జలవనరులశాఖ సర్కిల్ కార్యాలయ భవనానికి గానూ ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం తరుపున రూ.1.90 కోట్లు మంజూరయ్యాయి. ఏప్రిల్ 24న నాటి ఆర్థిక శాఖ మంత్రి హరీ‌ష్‌రావు చేత శంకుస్థాపన చేశారు. అయితే ఈ భవన నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం డిసెంబరు నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందుగా బిల్లులు అందక పనులు నిలిపి వేసినట్లు తెలిసింది. మరో వైపున ఈ భవన నిర్మాణంలో సాంకేతిక అంచనా లోపం కూడా పనులు ఆగేందుకు ఓ కారణమని తెలుస్తోంది. ఇక ముస్లింల మైనారిటీలకు గాను సుమారు రూ.75 లక్షల అంచనాతో నిర్మించిన షాదీఖానా భవనం కూడా కాంట్రాక్టర్ చేసిన పనుల వరకు రూ. 25 లక్షల వరకు బిల్లు అందకని పరిస్థితి. దీంతో ఆ కాంట్రాక్టర్ వాటి పనులను బేస్‌మెంట్ వరకు చేసి అర్ధాంతరంగా నిలిపి వేశారు నాటి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆయా భవన ని ర్మాణాలకు గాను ఎంతో గాను కృషి చేశారు. ఇక నిధుల అందకపోవటానికి గల కారణం రాష్ట్రంలో తాజాగా అసెంబ్లీ ఎన్నికలు జరగటం, మరో వైపున ప్రభుత్వాలు మారటం. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ రాగ మయి ఆయా భవనాల నిర్మాణ పనులు ముందుకు సాగేలా చూడాలని కల్లూరు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

భద్రాచలం, జనవరి 1: భద్రాచలంలోని వెంకటేశ్వర కాలనీలో గతంలో దొంగతనాకి పాల్పడిన మణుగూరుకు లావేటి విమలకుమార్ అనే వ్యక్తిని భద్రాచలం పోలీసులు సోమవారం అరెస్టుచేశారు. ఈ సందర్భంగా అతని వద్దనుంచి 28 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. ఈ వ్యక్తి గతంలో ఉమ్మడి జిల్లాలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడని తెలిపారు. అతడిని విచారించి, కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా

ప్రజా అవసరాల కోసం నిర్మించిన బావిని, బోరును ఆక్రమిస్తూ ప్రహరీ నిర్మాణం
పట్టించుకోని అధికారులు.. విస్తుపోతున్న స్థానికులు



కబ్జాకు గురవుతున్న స్థలం ఇదే

మణుగూరు, జనవరి 1: మణుగూరు మండల పరిధిలోని గుట్టమల్లారం గ్రామంలో ప్రధాన రహదారికి పక్కనే ఉన్న ప్రజా అవసరాల నిమిత్తం కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతోంది. ఇక్కడ గ్రామం ఏర్పడిన నాటి నుంచి ఈ ప్రాంతంలో సామూహిక ప్రయోజనాల కోసం బావి ఉండేది. ప్రజల అవసరాల నిమిత్తం పండుగలు, పబ్బాలకు జాతరల నిర్వహణ కోసం ఈ స్థలాన్ని కేటాయిం చారు. బావి నీరు తాగేందుకు ఉపయోగకరంగా లేక పోయేసరికి స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేం దుకు ఇక్కడే మండల అధికారులు ఓ బోర్‌ను కూడా వే యించారు. ఆ బోరు నీటిని కూడా స్థానికులు మిషన్ భగీరథ నీరు రాకముందు వరకు వినియోగిం చారు. ఆ తర్వాత ఈ స్థలం పక్కనే నివాసముండే వారు దానిని ఆక్రమించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న ట్లు తెలిసింది. ఈ ప్రాంతం 33/1 సర్వే నెంబర్ పరిధిలో ఉంది. ఓ గిరిజనుడికి సంబంధించి భూమి గా చిత్రీకరించి 33/2 లో ఈ భూమి ఉన్నట్లు మండ ల రెవెన్యూ అధికారులను బురిడీ కొట్టించి స్థలాన్ని కబ్జా చేసేందుకు దిగారనే ఆరోపణలున్నాయి. తమ అవసరాల నిమిత్తం కొన్నేళ్ల క్రితం కేటాయించిన భూమి ఇలా అన్యాక్రాంతమవ్వడంతో స్థానికులు విస్తుపోతున్నారు. బావిని బోర్‌ను మూసివేస్తూ ఈ స్థలంలో రేకులతో ఓ వ్యక్తి ప్రహరీ కూడా నిర్మించాడు. సర్పంచ్ కారం ముత్తయ్యతో పాటు పలువురు గ్రామస్థులు ఈ విషయంపై మండిపడు తున్నారు. ప్రభుత్వ బోగస్ పత్రాలతో కబ్జాకు పాల్పడే వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాన్ని కాపాడాలని కోరు తున్నారు. కళ్లముందే జరుగుతున్న కబ్జాను అరిక ట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో గ్రామ స్థులంతా కలిసి ఆందోళన బాట పడతామని స్పష్టం చేస్తున్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, జనవరి 1: సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదో తరగతి ఆంగ్లమాధ్యమ ప్రవేశ పరీక్షకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఈ నెల ఆరు లోపు పంపించాలని గిరిజన సంక్షేమ గురుకు ల ప్రాంతీయ సమన్వయ అధికారి తుమికి వెంకటేశ్వరరాజు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న జరుగుతుందని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



ఆర్‌అండ్‌బీ రహదారి సైడ్‌బర్మ్‌లను ధ్వంసం చేసిన దృశ్యం, తొలగించిన బీటీని మట్టితో కప్పిన కాంట్రాక్టర్

బీటీ రోడ్డును ధ్వంసం చేసిన కేబుల్ కాంట్రాక్టర్

రహదారి భద్రతను పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

దుమ్ముగూడెం జనవరి 1:ఆదివాసీ మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ కాంట్రాక్టు పనుల తీరు అధ్వానంగా మారాయి. కేబుల్ పనులు నిర్వహించే కాంట్రాక్టర్ ఇష్టారీతిన ఆర్‌అండ్‌బీ రహదారిని ధ్వంసం చేసినా సంబంధిత శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పత్రికా ప్రతినిధులు సమాచారం ఇచ్చినప్పటికీ, దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజాధనాన్ని కాపాడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరి స్తుండడంతో మండలంలో ఆర్‌అండ్‌బీ రహదారులు త్వరిత గతిన ధ్వంసమౌతున్నాయి.

కొద్దినెలల క్రితం

కొద్ది నెలల క్రితం పర్ణశాల అడ్డరోడ్డు వద్ద ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిను స్థానిక రైతు పొలానికి సాగునీళ్లకోసం అడ్డంగా తవ్వేశారు. దీనిపై కొందరు స్థానికులు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా చెరుపల్లి-రామచంద్రునిపేటల మధ్య ఆర్‌అం డ్‌బీ ప్రధాన రహదారి సైడ్‌బెరమ్స్‌ను కాంట్రాక్టరు ఇష్టారీతిన ధ్వంసం చేశాడు. బొజ్జిగుప్ప బీఎస్ఎన్ఎల్ నూతన సెల్ టవర్ నిర్మాణ పనుల్లో భాగంగా సంబంధిత కాంట్రాక్టరు చెరుపల్లి-రామచంద్రునిపేటల మధ్య సుమారు మూడు కిలోమీటర్ల పాటు ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకొని గోతులు తీసి కేబుల్ వేశారు. కేబుల్ వేసిన తర్వాత గోతుల్లో మట్టిని సరిగ్గా పూడ్చకపోవడంతో అడుగులోతున గుంతలు కనబడుతున్నాయి. అలాగే బీటీ రహదారిపై ఒక ప్రాంతంలో ఎక్సకవేటర్ పనుల్లో నిర్లక్ష్యం కారణంగా బీటీ ధ్వంసమవగా మట్టి పోసి కప్పేశారు. దీంతో ఎదురు బదురుగా ప్రయాణిస్తున్న వాహనాలు ప్రక్కకు తప్పుకునే క్రమంలో గోతుల్లో దిగబడిపోతున్నాయి. ఈ గుంతల కారణంగా కోయనరసాపురం ప్రాంతంలో ఈ నెలలో ముగ్గురు ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి లోనవగా, అందులో ఒకరికి కాలు విరిగింది. అలాగే కొనబోయినగుంపునకు చెందిన ఒక ట్రాక్టరు సైతం బోల్తా పడింది. రహదారిపై గోతులను పూడ్చి ప్రమాదాలకు లోనవకుండా చూడాలని లోతట్టు గ్రామాల ఆదివాసీ యువత కోరుతోంది. వాహనదా రులు ప్రమాదాలకు లోనైతే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై డిసెంబరు 29న ఆర్‌అండ్‌బీ డీఈ హరిలాల్‌ను దృష్టికి తీసుక రాగా వెంటనే తమ సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపి పరిస్థితిని చక్కదిద్దుతావన్నారు. ఐతే మూడు రోజులు గడచినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. బీఎస్ఎన్ఎల్ ఏఈ మదన్‌లాల్‌ను ప్రశ్నించగా సదరు కేబుల్ కాంట్రాక్టరుతో మాట్లాడు తానన్నారు.


తుమ్మలను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


నాయకులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి తుమ్మల

నాడు ఆత్మీయ సమ్మేళనం
నేడు అభినందనల వెల్లువ

- శ్రీ సిటీలోని మంత్రి నివాసంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలిన అభిమానులు, నాయకులు
- ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి
- వారి అభీష్టం మేరకే అడుగులు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆంధ్రజ్యోతిప్రతినిధి/ఖమ్మం రూరల్/ ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 1: జిల్లా నలువైపుల నుంచి వచ్చే దారులన్నీ శ్రీ సీటీ వైపే మళ్లాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జనవరి1,2023లో బీఆర్ఎస్‌పై తిరుగుబాటు నేపథ్యంలో ఖమ్మంరూరల్ మండలం బారుగూడెం శ్రీసిటీలో తన నివాసంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా, సరిగ్గా ఏడాదికి కొత్త సంవత్సరం తొలి రోజున అక్కడే సోమవారం ఘనంగా న్యూఇయర్ వేడుక నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధు లు, నాయకులు, ప్రజలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పోలీసు అధికారులు తరలివచ్చి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారి సమక్షం లో మంత్రి తుమ్మల నూతన సంవత్సర కేకను కట్ చేశా రు. పలు సంఘాల వారు, టీడీపీ నాయకులు రూపొందించి తీసుకువచ్చిన కేలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, నాయకులకోసం మంత్రి తుమ్మల ప్రత్యేకం గా విందు ఏర్పాటు చేశారు. సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానం లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ప్రజాభీష్టం మేరకు నడుచుకుంటున్నట్లు తెలి పారు. నూతన సంవత్సరం సందర్భంగా ఖమ్మం నియోజక వర్గ ప్రజలతో గడపాలని ఆలోచనతో శ్రీసీటీలోని తన నివాసంలో ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తుమ్మల యుగంధర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావీద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, బండి జగదీష్, జొన్నలగడ్డ రవి, శ్రీ సీటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు, ఆంజనేయ ప్రసాద్, విజయ్, కాకాని యశ్వంత్ చౌదరి, తమ్మినేని నవీన్, సర్పంచ్ పాండయ్య, విజయ్ రెడ్డి, ఉపేందర్, పంతులు నాయక్, సురేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలకు రాట్నం బహూకరిస్తున్న టీపీసీసీ నాయకులు, అభినందనలు తెలుపుతున్న టీజీవోస్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు

ఒత్తిడి లేని పౌరసమాజం ఏర్పాటు

- నూతన సంవత్సర వేడుకల్లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

గత ప్రభుత్వ ప్రజాపీడన నుంచి ప్రజలు విముక్తి పొందారని, స్వేచ్ఛాయుత వాతావరణంలో రాజకీయ ఒత్తిడిలేని పౌర సమాజం ఏర్పాటు జరుగుతుందని, ప్రజ లు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఆత్మగౌరవంతో జీవించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. సోమవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో అభినందనలు తెలిపేందుకు వచ్చిన వారితో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా శాంతికపోతం పావురాన్ని తుమ్మల ఎగురవేశారు. ప్రజలు కోరుకున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుందన్నారు. మేనిఫెస్టో ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలో విజయవంతం జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యులు ఎండీ జావీద్, రాయల నాగేశ్వర రావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, మలీదు వెంకటేశ్వర్లు, ఫాతిమా, మిక్కిలినేని మంజుల, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, ఖాదర్‌బాబా, శెట్టి రంగారావు, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, వేల్పాద్రి తదితరులు తుమ్మలకు అభినందనలు తెలిపారు. తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొటపాడు రుక్మారావు, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్షేమాధికారులు తుమ్మలను కలిసి అభినందనలు తెలిపారు.

కమ్మ సేవా సంఘాల క్యాలెండర్ ఆవిష్కరణ


కమ్మసంఘాల ప్రతినిధులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కమ్మవారి సేవా సంఘాల రాష్ట్ర సమాఖ్య ఆధ్వర్యంలో ముద్రించిన 2024 కేలండర్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం శ్రీసిటీలోని తన నివాసంలో ఉన్న ఆయన్ను పలు జిల్లాలకు చెందిన కమ్మవారి సంఘాల నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తుమ్మల రాష్ట్ర స్థాయి కమ్మసంఘాల సమాఖ్య, పలు జిల్లాల సంఘాల ఆధ్వర్యంలో ముంద్రించిన నూతన సంవత్సర కేలండర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ సమాజంలో పేదరికంలో ఉన్న వారిని ఆదుకునేందుకు కమ్మ సమాఖ్య కృషి చేయాలని, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని, సేవా కార్యక్రమాల్లో ముందుండాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ ప్రధానకార్యదర్శి రామకృష్ణప్రసాద్, కార్యదర్శి కండపనేని రత్నాకర్‌రావు, రాష్ట్ర నాయకులు దానాటి వెంకటేశ్వరరావు, సిరిపురపు సంపత్‌కుమార్, దనేకుల రాంబాబు, ఖమ్మం కమ్మ మహాజనసంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు, మాజీ అధ్యక్షుడు వేజెళ్ల సురేష్, సూర్యాపేట జిల్లా కోదాడ కమ్మసంఘం అధ్యక్షుడు వేమూరి సురేష్, వరంగల్ జిల్లా కమ్మసంఘం అధ్యక్షుడు మండడి కోటేశ్వరరావు, కాంగ్రెస్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ నాయకులు రాయల నాగేశ్వరరావుతోపాటు ఖమ్మం కమ్మ సంఘం నాయకులు మిక్కిలినేని నరేంద్ర, చావా నారాయణరావు, రావూరి సైదబాబు, బత్తుల బసవపున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.


నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు

ముఖ్యమంత్రిని కలిసిన ఏలూరి


సీఎంతో టీజీవో రాష్ట్ర నాయకుడు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 1: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ టీం సభ్యులు ఏలూరి శ్రీనివాసరావు, శ్యామ్ ఆధ్వర్యంలో కలిశారు. కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛాలను అందచేశారు. అనంతరం చీఫ్‌సెక్రటరీ శాంతికుమారిని కూడా కలిసి నూతన సంవత్సర శుభాకాం క్షలు తెలిపారు.

పొంగులేటిని కలిసిన టీఎన్జీవో నేతలు

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సోమవారం టీఎన్జీవో జిల్లా నాయకులు షేక్ అఫ్జల్‌హసన్, ఆర్వీఎస్ సాగర్, మహిళా అధ్యక్షురాలు శాబాను జ్యోతి తదితరులు కలిశారు. పుష్పగుచ్ఛాలను అందించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట బాగం పవన్‌కుమార్, సువర్ణన్ పాల్, నాగశివస్వప్న, వెంకటరెడ్డి, బుద్ధారామకృష్ణ, తాడేపల్లి కిరణ్, చంద్రకాంత్, వెంకటి, రమణారెడ్డి, గాలిశెట్టి నరేష్, అన్వర్ ఈశ్వర్ తదితరులున్నారు.


మంత్రి పొంగులేటితో టీఎన్జీవో నాయకులు

భద్రాద్రి రామయ్యకు
రాపత్తుపూర్ణ సేవ

- పాల్గొన్న దేవనాద రామానుజ జీయర్‌స్వామి


సీతారామచంద్రస్వామికి రాపత్తుపూర్ణ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 1: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామికి సోమవారం దేవస్థానంలోని నిత్య కల్యాణ మండపంలో రావత్తుపూర్ణ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవనాద రామానుజ జీయర్‌స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి నివేదన చేశారు. ఇదిలా ఉండగా నమ్మాళ్వార్ వరమపదోత్సవాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. భద్రాద్రి రామయ్య సోమవారం ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా బుధవారం దేవస్థానం హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.

'ముక్కోటి' సేవలకు ప్రశంసాపత్రాలు


ఈవో నుంచి ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న ఈఈ రవీంద్రనాథ్

భద్రాచలం, జనవరి 1: వైకుంఠ ఏకాదశి సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభకనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను రామాలయ ఈవో ఎల్.రమాదేవి అందజేశారు. రంగనాయకుల గుట్టపై ఉన్న ధాన్య మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల నిర్వహిస్తున్న ఉత్సవాల సమయంలో భద్రాచలం, పర్ణశాలలో వైదిక, పరిపాలన సిబ్బంది, ఎస్‌పీఎఫ్, ఇతర సిబ్బందిలో ప్రతిభ చాటిన సుమారు 90 మంది సిబ్బందికి ప్రోత్సాహకంగా ప్రశంసాపత్రాలను అందజేశారు.

అశ్వారావుపేటలో అత్యవసర చికిత్సలు

అశ్వారావుపేట, జనవరి 1: అశ్వారావుపేట సీహెచ్‌సీలో 24గం.లు వైద్యం లభిస్తుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. మహిళలకు ట్యూబెక్టమీ, సిజేరియన్‌లు ప్రతి మంగళ, శుక్రవారాలలో అశ్వారావుపేట చేస్తున్నామని తెలిపారు. కిడ్నీ డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. 100 పడకలకు సంబంధించి సౌకర్యాలు ఏర్పాటు, సిబ్బంది, టెక్నీషియన్‌ల కొరత ఉందని, వాటికోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పాము, తేలు, కుక్క కాటుకు సంబంధించి మందులన్ని అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డా. కృష్ణకాంత్ పాల్గొన్నారు.

బొగ్గు రవాణా టిప్పర్లకు గిట్టుబాటు ధర చెల్లించాలి

టేకులపల్లి, జనవరి 1: కోయగూడెం ఓసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి బొగ్గు తోలకాల టిప్పర్ లారీలకు గిట్టుబాటు ధర చెల్లించాలని టేకులపల్లి(కోయగూడెం) టిప్పర్ లారీ ఓనర్స్ అసోషియేషన్ డిమాండు చేసింది. టేకులపల్లిలో సోమవారం జరిగిన టేకులపల్లి టిప్పర్‌లారీ అసోషియేషన్ అధ్యక్షకార్యదరుశలు బానోతు రామా, నర్సింహారావు మాట్లాడారు. కోయగూడెం ఓసీ నుంచి ఇల్లెందు సీహెచ్‌పీకి బొగ్గు రవాణా టెండర్ పిలిచామ న్నారు. బొగ్గుతోలకాల టిప్పర్ లారీలకు అసోషియేషన్ నిర్ణయించిన టన్నుకు రూ180లు చెల్లించాలని వారు కోరారు. గతంలో తమకే టెండర్ దక్కాలనే ఉద్దేశ్యంతో కాంట్రాక్టర్లు అతితక్కువ రేట్లకు టెండర్లు దాఖలు చేశారన్నారు. దీనివల్ల టిప్పర్ లారీ ఓనర్లకు తీవ్రనష్టం వాటిల్లి లారీల మనుగడే ప్రశ్నార్థకగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను గమనించి ఇప్పటికైనా బొగ్గురవాణా కాంట్రాక్టర్లు యూనియన్ రేట్లకు టెండర్లు వేసి యూనియన్‌కు సహకరించాలని కోరారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లామని ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. లారీల విడిభాగాలు, డీజిల్, డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు, రోడ్డుటాక్సు, ఇన్సురెన్సులు ప్రతి ఏడాది పెరుగుతున్నాయని కాని బొగ్గు రవాణా కాంట్రాక్టర్లు మాత్రం రేట్లు తగ్గించుకుంటూ టెండర్లు వేస్తున్నారన్నారు. తక్కువ ధరకు టెండర్లు వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారు స్పష్టం చేశారు. యూనియన్ నిర్ణయించిన రేటుకు టెండర్లు వేయనట్లయితే లారీలే ఆధారంగా జీవనం సాగిస్తున్న టిప్పర్ ఓనర్లు కుటుంబ సమేతంగా రోడ్లపైకి ఎక్కి బొగ్గు రవాణ అడ్డుకొంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిప్పర్‌లారీ అసోషియేషన్ నాయకులు గోపి, రామారావు, మోహన్, నరేష్, రమేష్, తావుర్యా హరినాయక్, ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పోలీస్ సేవా పతకాలు

ఖమ్మం క్రైం/ మణుగూరు టౌన్, జనవరి1: రాష్ట్రంలోని పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు కనబరిచిన పలువురు అధికారులు, సిబ్బందికి పతకాలను ప్రకటిస్తూ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో ఖమ్మం కమిషనరేట్‌కు చెందిన అధికారులు, సిబ్బంది కూడా ఉన్నారు. వీరిలో సీసీఎస్ ఏసీపీ తోమళ్ల రవి, ట్రాఫిక్ ఏసీపీ ఎస్.సారంగపాణి, ఖమ్మం రూరల్ సీపీ రాజిరెడ్డి సీఎస్‌బీ ఎస్‌ఐలు దానాయ్య, వీపీపీ సత్యనారాయణ, ఎర్రుపాలెం ఏఎస్సై గోపాలరావు, ఏఆర్ఎస్సై సాజుద్దీన్, హెడ్ కానిస్టేబుళ్లు సీహెచ్ ముత్తయ్య, ఎం. వెంకటేశ్వర్లు, టీ.శ్రీనివాసరావు, డీ.శ్రీనివాసరావు, బీ.వెంకటేశ్వర్లు, ఎం. క్రిష్ణమూర్తి, సీహెచ్ దాసు, సోమయ్య, కానిస్టేబుళ్లు వి.నాగేశ్వరరావు, శ్రీనివాసదాసు, ఏఆర్‌పీసీ టీ.శ్రీనివాస్, ట్రాఫిక్ ఏఎస్సై రామయ్యలకు ఉత్తమ సేవా పతకాలు లభించాయి. 15వ బెటాలియన్ ఎస్సై నరాల సత్యనారాయణ ప్రసాద్‌కు, ఇంటిలిజెన్స్ విభాగంలో ఖమ్మం జోన్‌లో ఉన్న ఏఎస్సై సూర సత్యనారాయణ, ఏఆర్ఎస్సై పి.రంగారావు, హెడ్ కానిస్టేబుల్ నరసింహారెడ్డి, ఖమ్మం రేంజ్ ఏసీబీ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్ వై.రమేష్ కు కూడా ఉత్తమ సేవా పతాకాలు లభించాయి. మధిర లీడింగ్ ఫైర్‌మెన్ గా ఉన్న వై.వెంకటేశ్వరరావు సేవా పతకం లభించింది.

మణుగూరు డీఎస్పీ ఆఫీస్ రైటర్‌కు సేవా పతకం


వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్, జనవరి 1: మణుగూరు ఎస్‌డీపీవో కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టే బుల్ సామాల వెంకటేశ్వర్లుకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర హోం శాఖ సేవా పతకాన్ని ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు పోస్టింగ్ ఏడూళ్ల బయ్యారం పోలీస్‌స్టేషన్ కాగా డిప్యూటేషన్‌పై మణుగూరు డీఎస్పీ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతను పోలీస్ శాఖలో చేసిన విశిష్టమైన సేవలను గుర్తించి ప్రభుత్వం సేవా పతకానికి ఎంపిక చేసింది. పతకంతో పాటు రూ.20 వేల పారితోషకాన్ని కూడా అందిస్తుంది. సేవా పతకానికి ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును డీఎస్పీ రాఘవేందర్ రావుతోపాటు సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది, పలువురు ప్రముఖులు అభినందించారు.

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
ఆంధ్రజ్యోతి
మంగళవారం 2 జనవరి 2024

పెద్దమ్మతల్లి ఆలయాన్ని సందర్శించిన పాల్వంచ డివిజన్ పోలీసులు

పాల్వంచ,జనవరి 1 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)ని సోమవారం పాల్వంచ డివిజన్ పోలీసులు సందర్శించారు. పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ తన సిబ్బందితో కలసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారిని సంప్రదాయ పద్ధతిలో గౌరవించి శేషవస్త్ర ప్రసాదములతో సత్కరించారు. డీఎస్పీ వెంట పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, టౌన్ ఎస్ఐ బానాల రాము, రూరల్ ఎస్ఐ శ్రీనివాస తదితరులు ఉన్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు


ఎమ్మెల్యే కూనంనేని సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్లు

అంబరాన్నంటిన సంబరాలు..

● ఘనంగా 'నూతన' వేడుకలు

నెట్‌వర్క్: నూతన సంవత్సరపు సంబరాల వేడుకలు అంబరాన్నంటాయి. జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంతోపాటు సింగరేణి కార్మిక ప్రాంతాల్లో అధికారులు, కార్మికులు, కార్మికసంఘాల నాయకులు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు కేక్ కట్ చేశారు. విద్యానగర్‌లోని తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును నూతన సంవత్సర సందర్భంగా సన్మానించి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌కేక్‌కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను కొత్తగూడెంలో గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ సర్వీసు అధ్యక్షులు చింతలచెర్వు గెర్షోం తన కుటుంబసభ్యులతో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.కొత్త సంవత్సరం సందర్భంగా భద్రాద్రి జిల్లా జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్‌తోపాటు డైరెక్టర్లు సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


జిల్లా జడ్జి వసంత్‌పాటిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం


జడ్పీ చైర్మన్ శుభాకాంక్షలు..


దివ్యాంగులతో సంబరాలు జరుపుకొంటున్న రంగారావు


వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు అభినందనలు


కేక్ కట్‌చేస్తున్న సింగరేణి డైరెక్టర్లు


అశ్వాపురంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే పాయం


మాజీ మంత్రి కేటీఆర్‌తో కోనేరు చిన్ని


అశ్వారావుపేట మండలం తిరుమలకుంటలో కేక్ కట్ చేస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు


సాయిబాబా ఆలయంలో పూజలు


జూలూరుపాడులో కేరింతలు..


డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్


బూర్గంపాడులో కేక్ కట్‌చేస్తున్న పాత్రికేయులు




తుళ్లూరికి అభినందనలు, చంద్రుగొండలో చిన్నారి



ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం


పినపాక ఎమ్మెల్యే పాయంతో మణుగూరు పోలీసులు


ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో జీఎం

ప్రముఖులకు టీటీడీ క్యాలెండర్ల అందజేత

దుమ్ముగూడెం జనవరి 1: ఆంగ్లనూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్య పిలకా నాగేంద్రరెడ్డి సోమవారం మండలంలోని ప్రముఖ వైద్యులు, అర్చకులు, పత్రికా ప్రతినిధులు, రాజకీయ నాయకులకు టీటీడీ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు, ప్రసాదాలనందజేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

టీఎన్‌టీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ

బూర్గంపాడు, జనవరి 1: ఐటీసీ పీఎస్‌పీడీ భద్రాచలం యూనిట్ గుర్తింపు కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐటీసీ యూనిట్ హెడ్ సిద్ధార్థమహంతి, టీఎన్‌టీయుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరం అందరికి మంచి జరగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ జీఎం శ్యామ్‌కిరణ్, టీఎన్‌టీయుసి చైర్మన్ గల్లా నాగభూషయ్య ప్రధాన కార్యదర్శి గాదె రామకోటిరెడ్డి, అజీజ్, జీవన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, బషారత్, హెచ్‌ఆర్ మేనేజర్లు శ్రీనివాసరావు, బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

దుమ్ముగూడెం జనవరి 1: సామాజిక సేవకులు, సినీనటులైన పాకాలపాటి విజయవర్మ, ఆదిత్యటంల సౌజన్యంతో సోమవారం చెరువపల్లిలోని యాభై మంది వృద్ధులకు స్థానిక పెద్దలు రగ్గులను పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు తెలిపారు. గ్రామపెద్దలు వెంకన్నరాజు, మున్న, భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ ఎన్నిక

భద్రాచలం, జనవరి 1: భద్రాచలం ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్‌ను సోమవారం భద్రాచలంలోని హరితహోటల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా లింగాల శ్రీహరికుమార్, ఉపాధ్యక్షుడిగా పానుగంటి ఈశ్వర్, కార్యదర్శిగా ఈఎన్ ప్రసాద్‌యాదవ్, సహాయ కార్యదర్శిగా వనమా శివ, కోశాధికారిగా జిల్లా శ్రీనివాసులను ఎన్నుకున్నారు. అలాగే ముఖ్య సలహాదారుగా సీనియర్ జర్నలిస్టు రెడిన్ రమేష్‌తో పాటు ముఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు

దుర్గమ్మకు బంగారు నేత్రాల సమర్పణ

భద్రాచలం, జనవరి 1: భద్రాచలంలో ఆర్టీసీ ఇన్‌గేటు వద్ద ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి బంగారు కళ్లను భద్రాచలంకు చెందిన కిలారు ప్రకాష్, ఝాన్సీ దంపతులు అందజేశారు. ఐదు గ్రాముల బంగారంతో తయారు చేసిన బంగారు కళ్లను ఆలయ అర్చకులకు అందజేశారు.


బంగారు నేత్రాలు అందజేస్తున్న దృశ్యం

చిన్నారుల చదువుకు 'శ్రీమంత్‌రెడ్డి సొసైటీ' సాయం

మణుగూరుటౌన్, జనవరి 1: శ్రీమంత్ రెడ్డి ఎడ్యూకేషనల్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సమితిసింగారం గ్రామానికి చెందిన 3 చిన్నారులు, ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న దివ్యాంగ విద్యార్థికి సోమవారం ఆర్థిక సహకారాన్ని అందించారు. సమితిసింగారం గ్రామానికి చెందిన బెల్లం బుల్లెమ్మ-రాజబాబు దంపతులకు సంకీర్తన 5వ, సుష్మిత 3వ, నిఖిత 2వ తరగతులు చదువుతున్నారు. బెల్లెమ్మ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలిసిన సొసైటీ సభ్యులు రూ.3 వేల నగదుతోపాటు 25 కేజీల బియ్యాన్ని అందించారు. అదేవిధంగా మణుగూరు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరవం చదువుతోన్న దివ్యాంగ విద్యార్థి వర్షిక రాజుకు రూ.3 వేలను ఆయన చదువు నిమిత్తం ఖర్చుల కోసం అందించారు. ఈ వితరణలను సొసైటీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పీ అప్పారావు, బీ సుబ్బారెడ్డి, బీవీ రమణకుమార్, టీ రామిరెడ్డి, బీ సామ్యూల్, ఎం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన చర్ల కాంగ్రెస్ నాయకులు

చర్ల, జనవరి 1: రాష్ట్ర రెవెన్యూ, వ్యవసాయశాల మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావుని చర్ల మండల కాంగ్రెస్ నాయకులు దేవభక్తుని రామకృష్ణ, చీమలమర్రి మురళికృష్ణ, డీసీఎమ్మెస్ డైరెక్టర్ పరుచూరి రవికుమార్, చర్ల ఉపసర్పంచ్ సిరిపురపు శివలక్ష్మీనారాయణ, ఎన్సీసెల్ మండల నాయకులు తోటమళ్ళ వరప్రసాద్‌లు సోమవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం చర్ల మండలంలోని దీర్ఘకాలిక సమస్యలు వినతిపత్రాల రూపంలో మంత్రులకు వివరించారు. అలాగే మండలంలోని ప్రతీ పేదకుటుంబానికి ప్రభుత్వం నుంచి అదే అన్ని పథకాలు అందేలా చూడాలని మంత్రులను కోరారు. కాగా చర్ల సమస్యల పరిష్కారానికి ఇద్దరు మంత్రులు సానుకూలంగా స్పందించారని, త్వరలో సమస్యలు పరిష్కారం అవ్వుతాయని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


మంత్రి తుమ్మలతో చర్ల నాయకులు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు ప్రజాప్రతినిధులు

దమ్మపేట: నూతనసంవత్సరం సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణనను గండుగులపల్లిలో ఆయన నివాసంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అశ్వారావుపేట సిఐ కరుణాకర్, దమ్మపేట ఎస్ఐ రవికుమార్, అశ్వారావుపేట ఎస్ఐలు, ఎంపీపీ సోయం ప్రసాదు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, కొయ్యల అచ్యుతరావు, బొల్లికొండ నాగేశ్వరరావు, వానం శ్రీను, చిట్టినాయన, సర్పంచ్ సాగర్ బడే, చిన్నంశెట్టి యుగంధర్, గోపిశాస్త్రి, కక్కిరాల రమేష్, శ్రీరాముల ప్రసాదు, దొడ్డ బాస్కరరావు, తదితరులు వున్నారు. అనంతరం గండుగలపల్లి, దమ్మపేట చర్చిల్లో జరిగిన ప్రార్థన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రార్థనలు చేశారు. వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు.


ఎమ్మెల్యే జారేను అభినందిస్తున్న నాయకులు

ఆశీలు వసూలు చేస్తారు..

పార్కింగ్ స్థలం చూపరు

» భద్రాద్రికి వచ్చే రామ భక్తుల నుంచి ఆక్షేపణలు » వారాంతం వచ్చిందంటే రామాలయ పరిసరాలు అస్తవ్యస్తం

భద్రాచలం, జనవరి 1: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశం నలుమూలల నుంచి తరలివచ్చే రామ భక్తులు, పర్యాటకుల నుంచి ఆశీలు వసూలు చేస్తున్నా పార్కింగ్ స్థలం చూపకపోవడం పట్ల వారి నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఒకటి లేదా రెండు రోజుల నుంచి ఎదురవుతున్న సమస్య కాదు. వారాంతపు సెలవులు లేదా ఇతరత్రా సెలవుల సమయంలో భద్రాద్రిలోకి ప్రవేశించి రామాలయ పరిసరాలల్లో వాహనాల పార్కింగ్ సమస్యగా మారుతోంది. ఒకేసారి వందకు పైగా వాహనాల పార్కింగ్ చేయాల్సి రావడంతో జాగా లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని రామ భక్తులు పేర్కొంటున్నారు. పంచాయతీ తరపున సంబంధిత కాంట్రాక్టర్ రూ.50 నుంచి రూ.150 వివిధ రకాలుగా వాహనాల రుసుములు వసూలు చేసి రామాలయం పరిసరాల్లోకి పంపిస్తుంటారు. దీంతో స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు నడవడానికి జాగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు కోకొల్లలు. గత ఏడాది జూలై 13న తూర్పుమెట్లవైపు ఉన్న లడ్డూ ప్రసాద కౌంటర్ సమీపంలో పార్కు చేసిన వాహనం హ్యాండ్ బ్రేక్ సరిగా పడక కిందకు వచ్చే రోడ్డు పక్కనే ఉన్న రైలింగ్‌ను ఢీకొంది. ఈ సమయంలో అక్కడ భక్తులు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అయితే భద్రాచలం వచ్చే వాహనదారులకు సరైన పార్కింగ్ స్థలం చూపెట్టకుండా భారీ ఎత్తున ఆశీలు వసూలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. పార్కింగ్ చేసేందుకు జాగా లేకపోవడంతోమిథిలా స్టేడియం, ఉత్తరద్వారం మధ్యలో ప్రధాన రహదారి పక్కనే వాహనాలను వందల కొలది నిలిపివేస్తున్నారు. దీంతో స్టేడియం ప్రాంగణంలో ఉన్న ఉచిత నిత్యాన్నదాన సత్రంకు వెళ్లాలనుకునే భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ భద్రాద్రి దేవస్థానం పోలీసులు సమన్వయంగా వ్యవహరించి పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూపాలని రామ భక్తులు కోరుతున్నారు.


మిథిలా స్టేడియం సమీపంలోనే రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

కరాటేలో మణుగూరు విద్యార్థుల ప్రతిభ

మణుగూరు, జనవరి 1: మణుగూరులో సోమవారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను పినపాక ఎమ్మెల్యే పాయం ప్రత్యేకంగా అభినందించారు. కరాటే మాస్టర్ కాశిమల్ల పద్మ బ్లాక్ బెల్ట్ 3 వడాన్ ఆధ్వర్యంలో ఈ విద్యార్థులు శిక్షణ పొందారు. విద్యార్థులు జక్కుల యామిని బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్, రాయల పల్లవి బ్రౌన్ బెల్ట్, గుగులోత్ ధృవిక ఆరెంజ్ బెల్ట్, కోవిద్ సాయి, రిశ్విన్, జ్ఞానేష్, నిఖిలేశ్వర్ పూజారి, జోన్నలగడ్డ వేదాంశ్, విష్ణువర్ధన్ రెడ్డి, చతుర్వేద్, హాస్నీ ప్రద్యున్న రేయాన్ష్, గుగులోత్ వర్షిణి, చక్రేష్‌లు ఎల్లో బెల్ట్‌లు సాధించగా వీరిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. చదువుల్లో కూడా రాణించాలన్నారు. కరాటే అకాడమీ మాస్టర్ కేశవ్ గౌడ్ కూడా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. నేటి సమాజంలో కరాటే ఆడపిల్లలకు ఎంతో అవసరం అన్నారు. మాస్టర్ పద్మను కూడా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పాయం

రక్షణతో కూడిన ఉత్పత్తికి పాటు పడాలి

» జీఎం దుర్గం రామచందర్

మణుగూరుటౌన్, జనవరి 1 : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియిలోని పీవీకేసీ-2 గనిలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం దుర్గం రామచందర్ కార్మికులు, కార్మిక నాయకులకు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. నూతన సంవత్సరంలో నూతన ఉత్సాహంతో రక్షణ సూత్రాలు పాటిస్తూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలకు పాటుపడాలని ఆకాంక్షించారు. సాఫల్య వైఫల్యాలను బేరీజు వేసుకుని 2023 సంవత్సరానికి సింగరేణీయులందరం వీడ్కోలు పలికామన్నారు. నూతన సంవత్సరంలో కొత్తగా ఆలోచిస్తూ సింగరేణి సంస్థ పురోభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని, ఆ దిశగా పీకేఓసీ యాజమాన్యం ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకుల సహకారంతో కార్మికులను ఉత్సాహపరుస్తూ ముందుకుసాగాలని సూచించారు. అనంతరం 2022-23 ఆర్థిక సంవత్సరంలో పీకేఓసీ పూర్తి స్థాయి యంత్ర సామర్థ్యాన్ని వినియోగానికి రోలింగ్ షీల్డ్ వచ్చిన సందర్భంగా షీల్డ్‌ను కార్మికుల ముందు ప్రదర్శించి కార్మికులకే అంకితం చేశారు. వేడుకల్లో పీకేఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ టీ లక్ష్మీపతిగౌడ్, అధికారులు వీరభద్రుడు, డీ రాంబాబు, కే సురేష్, డీ శ్రీనివాస్, సీనియర్ పీఓ మదార్ సాహెబ్, గుర్తింపు కార్మిక సంఘం నాయకుల వై రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం నాయకులు వై జాన్ తదితులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం రామచందర్

న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపిన టీబీజీకేఎస్

మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2, కేసీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు వీ ప్రభాకర్ సోమవారం ప్రత్యేకంగా కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సవత్సరంలో ప్రతీ కార్మికుడు విధుల నిర్వహణలో రక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుని ఉత్పత్తి లక్ష్యాలను సాధనకు కృషి చేయాలని కోరారు. టీబీజీకేఎస్ కార్మికుల పక్షాన ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలకు.. కలశపూజ, శోభాయాత్ర

భద్రాచలం, జనవరి 1: భద్రాచలంలో సోమవారం శ్రీ అయోధ్య అక్షింతల, కలశపూజ, శోభాయాత్రను విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, హిందూ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. తాతగుడి వద్ద గల శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి అయోధ్య శ్రీరామచంద్రస్వామి వారి సేవిత అక్షింతలు పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పంపిణీ చేసేందుకు శోభాయత్రగా బయలుదేరారు. ముందుగా అక్షింతలకు రామాలయ వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్, హిందూ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

●సుజాతనగర్: శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ ద్వారా దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న శ్రీరామ అక్షింతల పూజా యాత్ర సోమవారం సుజాతనగర్ మండలంలోని పాత అంజనాపురం, సర్వారం పంచాయతీలలో ఈ శోభాయత్ర వైభవంగా నిర్వహించారు. అక్షింతలతో పాటుగా అయోధ్య రామాలయ నమూనా, విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను, అందించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వేణు ఆచార్యులు, ట్రస్ట్ సభ్యులు, భక్తులు తాళ్లూరి ధర్మారావు, పోటు కేశవరావు, అమ్మనాయక్, భాస్కర్, ఇంటూరి జనార్దన్‌రావు, భూక్యా రాజేష్, ప్రసాద్, శ్రీనివాస్, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

●చుంచుపల్లి : అయోధ్య నుంచి వచ్చినటువంటి శ్రీ రామ జన్మభూమి అక్షింతలతో నిర్వహించిన శోభాయాత్రలో చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి సోమవారం పాల్గొన్నారు. విశ్వహిందు పరిషత్ - శ్రీ రామ తీర్థట్రస్ట్ ఆధ్వర్యంలో రుద్రంపూర్ ప్రధాన సెంటరు నుంచి ఈ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ప్రముఖులు బాదావత్ సీతారాములు, లట్టి జగన్‌మోహన్, పులికంటి శ్రీనివాస్, అయ్యప్ప దీక్ష గురుస్వామి గుమ్మడి శ్రీనివాస్, సుంకర శ్రీనివాస్, భజరంగ్‌దళ్ జిల్లా ప్రముఖ మెరుగు చింతేశ్వర్, రాజా, సత్యనారాయణ, తివారి, బడే రమేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

●జూలూరుపాడు: అయోధ్య శ్రీరామచంద్రుని అనుగ్రహంతో వచ్చిన అక్షింతలతో సోమవారం మండలంలోని గుండెపూడి గ్రామంలో భక్తాంజనేయస్వామి ఆలయకమిటీ ఆధ్వర్యంలో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో పురోహితుడు ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకర్ల గ్రామంలో భక్తాంజనేస్వామి భక్త బృందం వారి ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గడపగడపకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ తూము కోటయ్య గ్రామస్థులు గాదె కృష్ణయ్య వైస్ ఎంపీపీ గాదె నిర్మల, వేల్పుల గోపాల కృష్ణ, జువ్వాజి వీర రాఘవులు, కంచర్ల హరీష్, కళ్యాణపు నరేష్, జయశ్రీ, మహాలక్ష్మి, పద్మ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం






సుజాతనగర్ మండలం పాత అంజనాపురంలో శోభాయాత్ర, చుంచుపల్లిలో పాల్గొన్న ఎంపీపీ శాంతి, జూలూరుపాడు మండలం కాకర్లలో..